

కార్పొరేటర్‌ను కలిసిన పర్వత్‌నగర్ వాసులు


కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీ వాసులు

మోతీనగర్: పర్వత్‌నగర్ వాసులు అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగంను ఆదివారం కలిసి కాలనీ సమస్యలపై చర్చించారు. శిథిలావస్థకు చేరిన భూగర్భ డ్రైనేజీని మార్చి నూతన డ్రైనేజీ, సీసీ రోడ్డు వేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన ఎంపీ ఈటల


కార్యకర్తను పరామర్శిస్తున్న ఎంపీ రాజేందర్ తదితరులు

కూకట్‌పల్లి: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడికి నిరసనగా చేపట్టిన బంద్‌లో పోలీసుల లాఠీచార్జీలో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ బీజేవైఎం నాయకుడు సాయి తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం సాయిని ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్, సూర్యారావు, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.

‘సే నో టు డ్రగ్స్’ పోస్టర్ ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌కు నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన నరసింహను ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యార్థులు డ్రగ్స్ తీసుకుంటూ చెడు అలవాట్లకు గురవుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ‘సే నో టు డ్రగ్స్’ పోస్టర్‌ను సీఐ నరసింహ ఆవిష్కరించారు. కొద్ది రోజులుగా జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విచ్చలవిడిగా లభిస్తోందని, యువత బానిసలుగా మారి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటు, ఇతరులపై దాడులకు దిగుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్యామ్, ఉపాధ్యక్షుడు దుర్గ, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, వికాస్, అభి, సాయితనయ్ తదితరులు పాల్గొన్నారు.



నల్లపోచమ్మ ఆలయంలో పూజలు



మూసాపేట: మూసాపేట నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. అమ్మవారిని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, చైర్మన్ ఎల్లేష్ యాదవ్, తూము సుధాకర్, తూము మనోజ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ సిబ్బందికి దుస్తులు అందజేత


దుస్తులు అందజేస్తున్న కృష్ణారావు కుటుంబ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎక్స్ ఆర్మీ వారెంట్ ఆఫీసర్ ఎం. కృష్ణారావు మనవడు, మనవరాళ్లు నీట్‌పరీక్షలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన సందర్భంగా ఆదివారం కాలనీ జీహెచ్‌ఎంసీ సిబ్బందికి, సూపర్ వైజర్‌కు దుస్తులు అందజేశారు.


హనుమాన్ ఆలయంలో బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఇంద్రనగర్ బస్తీ వాసులు - కూకట్‌పల్లి

పెండింగ్ డీఏలు, బిల్లులు విడుదల చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి


మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

నిజాంపేట్: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి పీఆర్సీని ప్రకటించాలి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. దోమలగూడలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో మేడ్చల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు జయసింహారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాయిస్ ఆఫ్ తెలంగాణ సంపాదకుడు మాణిక్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి మేడ్చల్ జిల్లాకు ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేసి వారిని సొంత జిల్లాలకు పంపాలన్నారు. 317 జీవో ద్వారా నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలని, జూన్‌లో జరిగిన ఉపాధ్యాయుల వెబ్ కౌన్సిలింగ్‌లో తప్పులు దొర్లాయని, స్పౌజ్ విషయంలో తప్పుడు బదిలీ పెట్టుకున్న ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం కమిటీ సభ్యులకు సంఘం నిబంధనలు, నిర్మాణం తదితర విషయాలను వివరించారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మదన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాకేశ్, కోశాధికారి ఉపేందర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం


మండల మహాసభలో పాల్గొన్న సీపీఎం కార్యకర్తలు

బాలానగర్: ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో సీపీఎం ముందు భాగంలో ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ మండల పరిధిలోని సీపీఎం బాలానగర్ మండల మహాసభ జరిగింది. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణారావుతో కలిసి ఆయన హాజరయ్యారు. సీనియర్ నాయకుడు చెన్న కేశవులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకుడు వెంకట నరసయ్య సభకు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, మూసీ ప్రక్షాళనపై అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలానగర్ శోభన సెంటర్, శ్రీశ్రీ నగర్ ప్రాంతాల్లో పాదాచారుల వంతెన నిర్మించాలని కోరారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఐలాపురం రాజశేఖర్, మండల కమిటీ సభ్యులుగా వెంకట్ నర్సయ్య, కె.ఎస్ వర్మ, విజయశంకర్, మాధవ్, చైతన్య, దీపరాజ్ ఎన్నికయ్యారు. సమావేశంలో జగన్, సుగుణ, భాగ్యలక్ష్మి, భారతి, రాజ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి బాబా భక్తుల నగర సంకీర్తన


సత్యసాయి నగర సంకీర్తనలో ప్రతినిధులు

మోతీనగర్: మోతీనగర్ ప్రధాన వీధుల్లో ఆదివారం సాయిబాబా భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. ప్రధాన వీధుల్లో సాయి భజనలు చేస్తూ శోభాయాత్ర కొనసాగింది. ఈ శోభాయాత్ర కబీర్‌నగర్, పాండురంగానగర్, మోతీనగర్ ప్రధాన వీధుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టాలని సత్యసాయి బాబా బోధించిన నీతి అని తెలిపారు. ఆయన సేవలు దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ఉన్నాయని గుర్తు చేశారు. విద్య, వైద్యం ఉచితంగా అందించాలనే సంకల్పంతో పుట్టపర్తిలో ఆసుపత్రి, కళాశాల సైతం ఏర్పాటు చేశారని తెలిపారు.

‘కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న సీఎం’



రాయదుర్గం: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఎంఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రావుగాళ్ళ బాలుమాదిగ విమర్శించారు. ఆదివారం రాయదుర్గం శ్యామ్‌లేట్ వీధిలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు శ్యామ్‌లేట్ గణేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం విధానాన్ని నిరసిస్తూ ఈనెల 29వ తేదీన జిల్లా కేంద్రంలో మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి రంగారెడ్డిజిల్లా సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సులో పాల్గొనేందుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకొని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు


అల్లాపూర్ డివిజన్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

కూకట్‌పల్లి: హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. ఆదివారం బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 2లో డివిజన్ అధ్యక్షుడు వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశ వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఉత్సవంలా జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు వేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, సభ్యత్వ నమోదు కో ఆర్డినేటర్ సద్గుణ, నాయకులు గోపి, రఘురాం, శేఖర్, సన్నీ, సూరిబాబు, ప్రేమ్‌కుమార్, వెంకట రమణ, గణేష్, రేణుక, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద నగర్‌లో..

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వాన్ని చేపట్టారు. సభ్యత్వ నమోదును అల్లాపూర్ డివిజన్‌లో అత్యధికంగా చేపడతామన్నారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, గోనెల సుదర్శన్, మోహన్‌గౌడ్, వెంకటరెడ్డి, సింగర్ సుదర్శన్, మురళీ మోహన్, సంతోష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ

ఆల్విన్‌కాలనీ: ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్ జన్మదినం సందర్భంగా ఆదివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రూబెన్, ఆల్విన్ కాలనీ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి, యోగేశ్వరి, రామారావు, రాజేష్, మున్నా, రాజా, బాలు తదితరులు పల్గొన్నారు.

బాషిపాక యాదగిరి ఆధ్వర్యంలో..

వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి ఎంబీసీ చైర్మన్‌ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దొరపల్లి పరుశరాములు, నాగుల మల్లేష్, బొల్లం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీ డివిజన్‌లో శ్రీదుర్గా విలాస్ హోటల్‌ను స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రుచికరమైన, నాణ్యతతో కూడిన పదార్థాలను అందించి ఆహార ప్రియుల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: కళాకారులు సంగీత కచేరీతో, కూచిపూడి నృత్యాలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఐఐఐటీ విద్యార్థులు డాక్టర్ టికె సరోజ ఆధ్వర్యంలో సంగీత కచేరీని నిర్వహించారు. సుస్వర, మధురిమ, అనుష్క, ప్రియాంష్, ఉదయ్‌కుమార్ రాణాప్రతాప్, సోహం, వైష్ణవి తదితరులు పాల్గొని సంగీత కచేరీతో ఆకట్టుకున్నారు. కల్వచర్ల విజయలక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. టీవి నటుడు జెఎల్ శ్రీనివాసులు, స్వాతిమీనన్ కళాకారులను అభినందించారు.

ఇనార్బిట్ ఆధ్వర్యంలో బడే దిల్‌వాలీ దీపావళి

సాక్షి సిటీబ్యూరో: దీపావళి పండుగను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ 'బడే దిల్‌వాలి దీపావళి' పేరిట ఒక ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నుంచి ప్రారంభించింది. ఈ దీపావళికి అందరూ ఒకే కుటుంబంగా మారాలని కోరుతుందని, అలాగే ప్రతి ఒక్కరూ దాతృత్వాన్ని స్వీకరించమని ప్రోత్సహిస్తుందని మాల్ ప్రతినిధులు తెలిపారు. డిజిటల్, ప్రింట్ మధ్యమాల ద్వారా చేసే ఈ ప్రచారం కుటుంబం స్నేహితుల ప్రాముఖ్యతను మాత్రమే కాకుండా సేవా సిబ్బంది, సహోద్యోగులు, పొరుగువారు సహా మన రోజువారీ జీవితాలకు సహకరించే ప్రతి ఒక్కరికి పండుగలో భాగం పంచాలని ఉద్బోధిస్తుందన్నారు.

నృత్య కళలను ప్రోత్సహించాలి

చందానగర్ : చందానగర్‌లోని అపర్ణ హిల్స్ పార్కు ఆవెన్యూలో శాస్త్ర, సంగీత, సాహిత్య సమ్మేళనం ఆధ్వర్యంలో గాన కచేరి, కూచిపూడి నృత్యం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త, మిథానీ చైర్మన్, ఎండీ ఎస్‌కె ఝా, కూచిపూడి నృత్య గురువు సి.బాలాత్రిపుర సుందరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నృత్య కళలను ప్రోత్సహించాలి, సంస్కృతీ సాంప్రదాయాలు ఎంతో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. శాస్త్రవేత్తలతో కలిసి నృత్య కళలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. గత 10 సంవత్సరాల నుంచి శాస్త్ర, సంగీత, సాహిత్య సమ్మేళనం ఫౌండర్, అధ్యక్షులు వేంపాటి లక్ష్మీ నారాయణ శర్మ ఆధ్వర్యంలో గాన కచేరి, కూచిపూడి నృత్యం నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు.

చిన్నారిపై దాడి.. ఒకరిపై కేసు

దుండిగల్: తన కుమార్తెపై ఓ వ్యక్తి దాడి చేసి గాయపరిచాడని తల్లి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. భౌరంపేట ప్రాంతానికి చెందిన భార్యభర్తలు నివసిస్తున్నారు. వీరికి 6 , 4 ఏళ్ల ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కాగా వీరు అద్దెకు ఉంటున్న మూడో అంతస్తులో రాంబాబు అనే వ్యక్తి తన కుటుంబంతో ఉంటున్నాడు. రాంబాబు భార్య డెలివరీ కోసం తన పుట్టింటికీ వెళ్లడంతో అతని స్నేహితుడు యోగి తరుచూ ఇంటికి వస్తుండే వాడు. ఈక్రమంలో అప్పుడప్పుడు బాధిత కుటుంబ రాంబాబు ఇంటికి వెళ్లేవారు. కాగా ఈ నెల 12న యోగి ఆడుకుందాం.. అని చెప్పి తన పెద్ద కుమార్తెను కొట్టి, మంచంపై పడేసి దాడి చేశాడని, స్నానం చేయించాడని, తనను కూడా అదేవిధంగా చేశాడని చిన్న కుమార్తె సైతం వివరించింది. దీంతో బాధిత తల్లి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు యోగిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం


ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

రాయదుర్గం: నవోదయ కాలనీ సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపడుతామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నవోదయ కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయనకు వివరించి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నవోదయ కాలనీలో పర్యటిస్తామని వారికి హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిలిగిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తా మని, త్వరలోనే సీసీరోడ్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు దశలవారిగా అందుబాటులోకి తీసుకొచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమున్నచోట డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే దాన్ని చిత్తశుద్ధితో పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడసత్యనారాయణ, కాలనీవాసులు వాసు, శేఖర్, రవి, వంశీ, సత్యం, భూపాల్‌రెడ్డి, విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.









